రంజాన్ వేళలు
ఇఫ్తార్-మంగళవారం
సాయంత్రం - 6.30
సహర్-బుధవారం
ఉదయం - 5.05

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

» ప్రజావాణిలో అధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన



దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 99 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూసర్వే, పంచాయతీలు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలు ఈ ఫిర్యాదుల్లో ఉన్నాయని వెల్లడించారు. అధికారులు ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి, తక్షణమే నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ప్రజావాణి అర్జీలను పట్టించుకోరా?

» అధికారులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను పట్టించుకోరా? సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోరా? అంటూ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిష్కరించలేని పక్షంలో ప్రజావాణి నిర్వహించడం ఎందుకంటూ ప్రశ్నించారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులే రావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన అనంతరం పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. కాగా, సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 55 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డీఆర్వో హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.



- ఖాళీగా 3 టైపిస్ట్ పోస్టులు, 60 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు
- కొత్తగా మరో 18 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు
- త్వరలో నియామక ప్రక్రియపై ఉన్నతాధికారుల కసరత్తు

కారుణ్యానికి గ్రీన్ సిగ్నల్

బాధిత కుటుంబాల ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం

స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మూడున్నరేళ్లుగా ఈ నియామకాలు నిలిపివేయడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అర్హతకు తగిన ఉద్యోగ ఖాళీలు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 ఏళ్లకు పెంచడంతో ఖాళీలు ఏర్పడలేదు. కాగా, జిల్లా పరిషత్తు పరిధిలో మూడు టైపిస్ట్ పోస్టులతో పాటు 60కి పైగానే ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ప్రభుత్వం జిల్లాకు కొత్తగా మరో 18 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేసింది.

వికారాబాద్, మార్చి10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 2021, జూలై నెల వరకు జిల్లా పరిషత్తు ఉన్నతాధికారులు కారుణ్య నియామకాలు చేపట్టారు. అప్పటి నుంచి ఉద్యోగ ఖాళీలు లేక కారుణ్య నియామకాలను నిలిపి వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో లేదా సర్వీసులో ఉండగా మృతి చెందితే ఆ కుటుంబంలో భార్య, కుమారుడు, కూతురు, సోదరుడు, సోదరిలకు ప్రభుత్వం కారుణ్య నియామకాల కింద విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగావకాశం కల్పిస్తుంది. మూడున్నరేళ్లుగా జెడ్పీ, మండల పరిషత్తులు, ఇతర స్థానిక సంస్థల పరిధిలో కారుణ్య నియామకాల ప్రక్రియ చేపట్టడం లేదు.

తప్పని ఎదురుచూపులు

వీఆర్‌వోల సర్దుబాటులో భాగంగా జిల్లా పరిషత్తుకు ఏడుగురిని కేటాయించారు. ఉమ్మడి జిల్లా పరిషత్తు విభజన జరిగిన తరువాత తొలిసారిగా వికారాబాద్ జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో నలుగురికి కారుణ్య

మిగతా 8వ పేజీలో...

ఉద్యోగ ఖాళీలు లేక..

అప్పట్లో కారుణ్య నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అంతర్గత ఉత్తర్వుల్లో జెడ్పీ, మండల పరిషత్తు, మున్సిపాలిటీల ప్రస్తావన లేదంటూ ఉన్నతాధికారులు ఈ నియామకాల చేపట్టేందుకు ముందుకు రాలేదు. అలాగే జీవో 317 ప్రకారం చేపట్టిన ఉద్యోగుల విభజనలో జిల్లాలో వివిధ కేడర్ల పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. ఉద్యోగ ఖాళీలు లేకపోవడంతో కారుణ్య నియామకాల కోసం బాధిత కుటుంబాలకు ఎదురు చూపులు తప్పలేదు. కాగా, ఇటీవల బాధిత కుటుంబాలు సీఎస్‌ను, మంత్రులను, ముఖ్యమంత్రిని కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశాయి. బాధిత కుటుంబాల ఆవేదనను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఇస్రో 'యువికా'కు దరఖాస్తు చేసుకోండి

» 9వ తరగతి విద్యార్థులకు అవకాశం

వికారాబాద్, మార్చి10(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో యువ విజ్ఞాన్ కార్యక్రమం(యువికా) 2025 నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు. దీని ద్వారా పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికతపై అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 23వ తేదీ వరకు ఇస్రో అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 8వ తరగతి మార్కులు(50శాతం), ఆన్లైన్ క్విజ్ ప్రతిభ (10శాతం), సైన్స్‌ఫెయిర్, ఒలంపియాడ్, క్రీడలు తదితరాల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదలవుతుందన్నారు. మే 19 నుంచి 30 వరకు రెండు వారాలపాటు శ్రీహరికోట, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్, డేహరాడూన్ , తిరువనంతపురం, షిల్లాంగ్ కేంద్రాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



తప్పుడు పర్మిట్లతో

ఇసుక దోపిడీ

- సీసీ రోడ్లు, స్కూళ్ల నిర్మాణాల పనులంటూ అక్రమ రవాణా
- అధికారులను బోల్తా కొట్టించి అనుమతులు
- కాగ్నా నుంచి ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్మకాలు

7

ఆకాశాన్ని తాకుతున్న అక్రమ నిర్మాణాలు!

» జీ ప్లస్ వన్ అనుమతితో ఐదంతస్తుల బంగ్లాలు » ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
» గుండ్లపోచంపల్లి బల్దియాలో ఇష్టారాజ్యం » పట్టించుకోని సంబంధిత అధికారులు

మేడ్చల్ టౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతుండటంతో ఈ వ్యవహారానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ ఆదాయాన్ని భారీగా గండిపడుతోంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడ, కండ్లకోయలో అనుమతులు లేకుండా వందల సంఖ్యలో భవనాలు నిర్మించారు. ఈ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో విద్యాసంస్థలు ఉండడంతో ఇక్కడ హాస్టళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు కండ్లకోయ, మైసమ్మగూడలో స్థలాలు తీసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా ఐదారు అంతస్తులతో భవనాలను నిర్మించారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి విద్యాసంస్థలతో పాటు ఇతర విద్యాసంస్థల్లో దాదాపు 40వేల మంది విద్యార్థులున్నారు. కండ్లకోయలోని

మిగతా 8వ పేజీలో...



మైసమ్మగూడలో అక్రమంగా చేపట్టిన భవనాలు

రెగ్యులరైజేషన్ పేరిట మరో అక్రమానికి తెర

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నిర్మించిన అక్రమ నిర్మాణాలకు భద్రత కల్పించడానికి మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న సమయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. అనుమతులు లేని నిర్మాణాలను అసెస్‌మెంట్ చేసి కొద్దిపాటి ట్యాక్స్ విధించి రెగ్యులరైజ్ చేయాలంటూ తీర్మానం చేసింది. దీంతో ఎలాంటి ఫీజులు చెల్లించకుండా నిర్మించిన భవనాలకు రక్షణ కల్పించడానికి గత పాలకులు, అధికారులు వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి బాసటగా నిలవడంతో అక్రమ కట్టడాలు మరింత పెరిగాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో నేడు

పరిగిలో మెగా జాబ్ మేళా

పరిగి, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్స్‌కాన్ ఆధ్వర్యంలో పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నంబర్2లో మంగళవారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కంపెనీ ప్రతినిధులు ఆనంద్, హిర్యాలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేవలం మహిళల కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్‌లో ఉన్న కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపై చదినవారంతా ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 70కి.మీ పరిధి వరకు ఉచిత రవాణా వసతి కల్పిస్తామని తెలిపారు. ఇంకా దూరం ఉన్నవారికి కంపెనీలో ఉండేందుకు వసతి కల్పిస్తారని తెలిపారు. రూ.17 వేల వేతనంతోపాటు, అన్ని రకాల వసతులు ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. ఈ కంపెనీలో 95 శాతం మహిళలే పని చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఈ చల్మారెడ్డి, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



గిరిజన తండాలో రైతులకు నోటీసులు ఇస్తున్న ఫారెస్టు సెక్షన్ అధికారి స్నేహశ్రీ

అటవీ భూముల ఆక్రమణదారులకు నోటీసులు

బషీరాబాద్ ఫారెస్టు అధికారుల ఆగ్రహం

బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల ఆక్రమణలపై తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు రాష్ట్ర సరిహద్దు ప్రాంత గ్రామాల కన్నడిగులను గుర్తించిన అధికారులు ముందస్తు నోటీసుల జారీ చేస్తున్నారు. సోమవారం మండలంలోని మైల్వార్ రిజర్వు ఫారెస్టులోని కర్ణాటక సరిహద్దు గ్రామాలైన భోజ్యానాయక్‌తండా, పలుకుచ్చతండా, కారోబర్‌తండా, బోందెపల్లి తండాల్లో బషీరాబాద్ సెక్షన్ అధికారిణి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప సిబ్బందితో కలిసి పర్యటించారు. అక్కడి రైతులు కొందరు తెలంగాణ అటవీ భూముల్లోకి చొరబడడంపై అధికారులు వారితో మాట్లాడారు. మరోసారి ఇలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్టు సెక్షన్ అధికారిణి మట్లాడుతూ ఇటీవల రెండు రాష్ట్రాల అధికారులు నిర్వహించిన జాయింట్ సర్వేలో కర్ణాటక రైతులు సుమారు 280 ఎకరాల తెలంగాణ అటవీ భూముల కబ్జాలో ఉన్నట్లు గుర్తించారన్నారు. అలాగే సరిహద్దు తెలంగాణ గ్రామాల రైతులు కూడా అటవీ భూముల్లో 396 ఎకరాల కబ్జాలో ఉన్నారన్నారు. ఇప్పటికే ఆక్రమణల భూములను కొంత స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగతా భూములను కబ్జాల నుంచి విడిపించి ప్లాంటేషన్‌కు చర్యలు చేపడుతున్నమన్నారు. ఇప్పటికే భూ ఆక్రమణలకు పాల్పడిన కర్ణాటకలోని 7గురిపై కేసులు నమోదు చేశామన్నారు. తెలంగాణలోని మైల్వార్‌తండాలో అటవీ భూముల కబ్జాలో ఉన్న 17 మంది రైతులపై కోర్టులో కేసు నడుస్తుందని గుర్తు చేశారు.



వార్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వేతనాలు చెల్లించండి మహాప్రభో!

» ఆందోళన చేసిన మున్సిపల్ కార్మికులు

కీసర, మార్చి10(ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం కార్మికులు ఆందోళన చేశారు. నాలుగు నెలలుగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర వార్డు కార్యాలయంలో విధులు నిర్వహించే కార్మికులకు వేతనాలు రావడం లేదని వారు కీసర వార్డు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ నాగమణి మాట్లాడుతూ త్వరల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పకడ్బందీగా 'పీఎం విశ్వకర్మ' స్కీం అమలు

» వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి10(ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల వారు ఆర్థికంగా మరింత బలపడేందుకు పీఎం విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో కుల వృత్తులపై ఆధారపడ్డ కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్రం తీసుకువచ్చిన పీఎం స్వానిధి పథకం అమలు, పురోగతిపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలి, మంగలి, ఉప్పరి తదితర 18 రకాల చేతివృత్తుల నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రుణాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీబీసీడీవో ఉపేందర్, మెప్మాపీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, వెంకటయ్య, ఎస్సీ కార్పొరేషన్,వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ సందేహాల నివృత్తికి మేడ్చల్ కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఈ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్ డెస్క్ పనిచేస్తుందన్నారు. సందేహాలను నివృత్తికి కాల్ సెంటర్‌లోని 9492409781 ఫోన్ నంబరులో మార్గనిర్దేశం పొందాలని కలెక్టర్ సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష


వికారాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సోమవారం జరిగిన ఈ పరీక్షకు జిల్లాలో 6,968 మంది విద్యార్థులకు గాను, 6,852 మంది హాజరు కాగా, 116 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,738 మందికి గాను5,669 మంది హాజరు కాగా, 69 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,230మందికిగాను 1,183 మంది హాజరు కాగా, 47 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ శంకర్ నాయక్ తెలిపారు.


తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తగ్గి ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలోని బోర్లకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పారి శుధ్య పనులు కొరవడినందున తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ముత్యాలు, రాధాకృష్ణ, జంగయ్య, వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, చిత్తారి, మల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.





వేతనాలు వెంటనే చెల్లించాలి

కీసర రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. సకాలంలో వేతనాలివ్వక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అరకొర వేతనాలైనా నెలనెలా చెల్లించక నిత్యావసర వస్తువుల కొనుగోళ్లకు అప్పు చేస్తున్నామని వాపోయారు. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. జీతాలు నెల నెలా ఇవ్వాలన్ని కమిషనర్‌ను కోరగా దాటవేస్తూ వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు సకాలానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి10(ఆంధ్రజ్యోతి):ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని కాలనీల్లో డ్రైనేజీ సమస్య ఉందని, యూజీడీ ఏర్పాటుతోపాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. బృందావన్ కాలనీ, త్రిశక్తినగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదన్నారు. పేదలకు రేషన్ కార్డులివ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులను గుర్తించాలన్నారు. సీపీఎం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు మునలయ్య, పురుషోత్తం, శంకర్, వీరేశం, యాదగిరి ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, స్థానికులు







వందశాతం పన్నులు వసూలు చేయాలి



ట్యాక్స్ వసూళ్లపై అధికారులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ సంధ్య

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ మున్సిపల్ పరిధిలో ఎక్కడా ప్రజలకు తాగునీటి సరఫరాలో నీటిఎద్దడి లేకుండా చూడాలని తూంకుంట మున్సిపల్ స్పెషలాఫీసర్ సంధ్య అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తూంకుంట మున్సిపల్ పరిధిలో మున్సిపల్ స్పెషలాఫీసర్ సంధ్య మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలసి పర్యటించారు. వేసవి తీవ్రం అవుతున్న దృష్ట్యా వివిధ ఎక్కడా ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని, అందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని కమిషనర్ వెంకటగోపాల్‌కు, సిబ్బందికి సూచించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో స్పెషలాఫీసర్ పర్యటిస్తూ ట్యాక్స్ వసూళ్లపై శ్రద్ధ తీసుకొని వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధి హకీంపేట సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లలో స్పెషలాఫీసర్ మొక్కలు నాటారు. డీఆర్‌సీ సెంటర్‌ను, బయోమైనింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ సంధ్య మాట్లాడుతూ మున్సిపల్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ సునీత, ఆర్‌ఓ హర్షద్ అహ్మద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి సన్మానం



చేవెళ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.పద్మావతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. సోమవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో పీసీసీ క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులకు సకాలంలో అందించి ఆర్థిక చేయూతనివ్వాలని ఈ సందర్భంగా ఈడీని కోరామని వసంతం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.







యువత క్రీడల్లోనూ రాణించాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రిలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్‌పటేల్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, బంధులాల్, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఖలీల్, ఆంజనేయులు, వేణు, వీరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



టాస్‌వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఉన్నత ప్రమాణాలతో గురుకులాల ఏర్పాటు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకుడు రఘునాయక్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యనందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రూ.11వేల కోట్లతో 55యంగ్ ఇండియా రీజినల్ పాఠశాలలను నిర్మిస్తుందని తెలిపారు. కొందుర్గులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా పాఠశాలకు రూ.200కోట్లు కేటాయించారని తెలిపారు. ఒక్కో పాఠశాలలో 120మంది ఉపాధ్యాయులు పనిచేస్తారని, సకల సౌకర్యాలతో పాఠశాల భవన నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఇబ్రహీం, అగ్గనూరి బస్వం, వెంకట్‌రెడ్డి, హైదర్ ఘోరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాయక్

పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వే



శాంపిల్ సర్వే నిర్వహిస్తున్న నిర్వాహకులు

ధారూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ధారూరు, ఎబ్బనూర్, మైలారం, అల్లాపూర్, డోరేంటా తండా పాఠశాలల్లో సోమవారం రాష్ట్రస్థాయి ఎఫ్ఎల్ఎన్(మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన) ఫైనల్ శాంపిల్ సర్వేను నిర్వహించారు. పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల్లో తెలుగు, ఆగ్లం, గణిత సామర్థ్యాలను పరిక్షించే కార్యమంలో భాగంగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామ్ మస్తాన్ ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 12వ తేదీ వరకు సర్వేను నిర్వహిస్తున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ టీం తయారుచేసిన పరీక్షాంశాలను రోజుకొక సబ్జెక్ట్ చొప్పున డీఈడీ, బీఈడీ ఛాత్రోపాధ్యాయులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తూ పఠన, రాతాంశాలను పరీక్షించి ఆన్‌లైన్‌లోని సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కల్లెపల్లి రవిచంద్ర, ప్రధానకార్యదర్శిగా పాక రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉప్పర్‌పల్లిలోని జిల్లా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశానికి ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు కోలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.నూతన కమిటీలో దేశం కృష్ణాగౌడ్ కోశాధికారిగా, తుమ్మ రవికిరణ్‌రెడ్డి, పన్నాల బాల్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా, పి.రామకృష్ణ, రేణుయాదవ్ సహాయ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రామారావు, శ్రీరాములు నియమితులయ్యారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి ఎం.వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.మల్కయ్య, రచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎండలు పెరిగిపోయి ఒక వైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుండగా మరోవైపు ఇసుక అక్రమార్కులు యాలాల మండలం యాలాల, గోవింద్‌రావుపేట తదితర ప్రాంతాల్లో కాగ్నా నది నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. యాలాల రెవెన్యూ కార్యాలయంలో ఇసుక పర్మిట్లు పొంది అదే పర్మిట్లపై వందలాది ఇసుక ట్రాక్టర్లను రవాణా చేస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ నుంచి అధికారులు రూ.2వేల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఒక పర్మిట్ పొంది అదే పర్మిట్‌పై ఇసుక ట్రాక్టర్లను ఇష్టానుసారం ఇసుక రవాణా చేస్తున్నారు. శనివారం రాత్రి యాలాల మండలంలో ఇసుక రవాణా జరుగుతోందని పోలీసు ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. మరో ఐదు ట్రాక్టర్ల డ్రైవర్లు తప్పించుకున్నట్లు సమాచారం. ఏడు ఇసుక ట్రాక్టర్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఇసుక ట్రాక్టర్లను విడిపించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు ప్రయత్నాలు చేశారు. అక్రమ ఇసుక రవాణాను అరికడుతామని ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతుండగా మరో వైపు సీఎం నియోజకవర్గం కొడంగల్‌కు సమీప యాలాల మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కాగా పట్టుకున్న ఏడు ట్రాక్టర్లలో నాలుగింటిలో మాత్రమే ఇసుక ఉందని, ఆ ట్రాక్టర్ల డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి రెవెన్యూ శాఖకు బైండోవర్ చేశామని ఎస్ఐ గిరి చెప్పారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

కరన్‌కోట్ గ్రామాన్ని సందర్శించిన అధికారులు

తాండూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో వేసవి కాలం దృష్ట్యా తీవ్ర నీటిఎద్దడి తలెత్తింది. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులైన మాజీ ఎంపీపీ శరణబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ జర్నప్ప తదితరులు ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన దేఆల మేరకు ఎంపీడీవో విశ్వప్రసాద్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి సమస్యపై గ్రామస్తులతో మాట్లాడారు. కాగ్నా నది నుంచి నీటిని కరన్‌కోట్ గ్రామంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారి వెంట మాజీ ఎంపీపీ శరణబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ జర్నప్ప ఉన్నారు.


బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రణాళికాబద్ధంగా పరిగి అభివృద్ధి

పరిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రోడ్ల వెడల్పునకు రూ.340కోట్ల మంజూరయ్యాయని తెలిపారు. రూ.120కోట్లతో పరిగి-షాద్‌నగర్, రూ.120కోట్లతో పరిగి-వికారాబాద్, రూ.100కోట్లతో గడిసింగాపూర్-రంగారెడ్డిపల్లి రోడ్ల వెడల్పు పనులకు మంగళవారం శంకుస్థాపన చేస్తామని తెలిపారు. పట్టణ శివారు కొత్తకుంట అభివృద్ధికి రూ.29లక్షలతో పనులు చేస్తామన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే బడ్జెట్‌లో పరిగి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు నిధులు మంజూరు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ట్రిపుల్ ఆర్ పరిగి నియోజకవర్గం మీదుగా వెళ్తుందన్నారు. హెచ్‌ఎండీఏ పరిధిని పూడూరు మండలం మన్నెగూడ వరకు పొడిగించామని తెలిపారు. పరిగి మీదుగా కృష్ణా రైల్వేలైన్‌కు రూ.8కోట్లతో సర్వే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా పథకాల లబ్ధిదారుల ఎంపిక చేస్తామని తెలిపారు. ఇందుకు మంగళవారం స్టేడియం మైదానంలో సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, వైస్‌చైర్మన్ అయ్యూబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పరిగి శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం 8గంటలకు విశ్వక్సేన ఆరాధన, కంకనధారణం, దేవయజ్ఞం, చండీహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చండీహోమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమారెడ్డి దంపతులు కూర్చున్నారు. హోమం అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రకమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

విద్యుత్ అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందిపడుతున్నా విద్యుత్ అధికారులు స్పందించడం లేదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలా మంది రైతులు నూతన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదన్నారు. పొలాల్లో కిందికి వేలాడుతున్న కరెంటు వైర్లతో పశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేశం, కృష్ణారెడ్డి, విశ్వనాథం, శంకర్‌సింగ్, జితేందర్‌సింగ్ రైతులు పాల్గొన్నారు.

తప్పుడు పర్మిట్లతో ఇసుక దోపిడీ

సీసీ రోడ్లు, స్కూళ్లలో పనులంటూ రవాణా

అధికారులను బోల్తాకొట్టించి అనుమతులు ● కాగ్నా నుంచి ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్మకాలు

తాండూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనుల పేరిట నామమాత్ర రుసుం చెల్లించి కాగ్నా నది నుంచి ఇసుక తోడి ప్రైవేట్ నిర్మాణాలకు డంప్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు, అధికారుల కళ్లుగప్పి కొందరు ఇసుక అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్ సమీప కాగ్నా నది నుంచి ఖాంజాపూర్‌నకు చెందిన కొందరు పెద్దేముల్ మండలం ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులకంటూ ఇసుక తరలిస్తున్నారు. అయితే రోడ్డు పూర్తయి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభోత్సవం సైతం చేశారు. అయినా అదే సీసీ రోడ్డుకంటూ పర్మిట్ పొంది కాగ్నా నుంచి ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్ముకుంటున్నారు. ఖానాపూర్‌లో రూ.4లక్షలతో సీసీ రోడ్డు వేసి నెలరోజులైంది. అక్రమార్కులు తహసీల్దార్ కార్యాలయంలో ఖానాపూర్ పేరిట పర్మిట్లు పొంది కాగ్నా నది నుంచి ఐదు ట్రాక్టర్లతో రోజుకు 16ట్రిప్పుల ఇసుక తోడి ప్రైవేట్‌గా అమ్మేసుకుంటున్నారు. తహసీల్దార్ తారాసింగ్ పర్మిటిచ్చే సమయంలో గ్రామానికి వెళ్లి పరిశీలించాల్సి ఉన్నా ఆయన పనులను చూడకుండానే అనుమతులిచ్చేశారు. దీంతో అక్రమార్కులు సోమవారం సీసీ రోడ్డు పేరిట కాగ్నా నుంచి ఐదు ట్రాక్టర్లతో 16 ట్రిప్పుల ఇసుకను తీసుకెళ్లారు. ఖాంజాపూర్‌నకు చెందిన మరో ట్రాక్టర్ యాలాల మండలం బషీర్‌మియాతండాలో పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పేరిట అనుమతి పొంది తండాకు చెందిన ఓ నాయకుడి ఇంటి వద్ద డంప్ చేసింది. ఈ విషయంపై విలేకరులు ఖాంజాపూర్ గేటువద్ద ట్రాక్టర్ల అనుమతులను పరిశీలించగా వారి అక్రమాలు వెలుగులోకొచ్చాయి. దీనిపై తాండూరు సబ్‌కలెక్టర్‌కు సమాచారమిచ్చారు. ఆయన రెవెన్యూ అధికారులను చర్యల కోసం పురమాయించారు. ఇలా ఏదో ఒకచోట సీసీ రోడ్లనో, స్కూళ్లలో మరమ్మతులనో అనుమతులు పొంది ఇసుకను అమ్ముకుంటున్నారు.


ప్రొసీడింగ్ కాపీ చూపుతున్న తహసీల్దార్ తారాసింగ్


బషీర్‌మియాతండా పాఠశాల పేరిట ఓ ఇంటి ముందు డంప్ చేస్తున్న ఇసుక

అధికారుల పట్టింపు లేకనే...

ఇదిలా ఉంటే అభివృద్ధి పనులకంటూ కాగ్నా నదీ పరివాహక ప్రాంతాల నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. అయితే రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారులు పట్టించుకోకే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఇసుక పర్మిట్లను రద్దుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా తప్పుడు సమాచారంతో అనుమతిపొంది ప్రైవేట్ అవసరాలకు ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం కోసమని ఇసుక తరలింపునకు దరఖాస్తు చేశారని, అది నమ్మి తాము పర్మిట్లు ఇచ్చామని చెప్పారు. సోమవారం విలేకరుల తనిఖీల్లో తప్పుడు సమాచారం ఇచ్చి పర్మిట్లు పొందినట్లు రుజువైందన్నారు. ఇలా అధికారులను, ప్రభుత్వాన్ని బోల్తాకొట్టించి పర్మిట్ పొందిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ చెప్పారు.



కాగ్నా నది నుంచి ఖానాపూర్‌నకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

తాగునీటి పైపులైన్లలో చెట్ల వేర్లు

బొంరాస్‌పేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 25 సంవత్సరాల కిందట వేసిన పురాతన సిమెంట్ పైపులైన్లలో చెట్ల వేర్లు రావడంతో తాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. మండల కేంద్రంలో పురాతన కాలం నాటి పైపులైన్‌ల జాయింట్‌లు వదులు కావడంతో ఎక్కడపడితే అక్కడ చెట్ల వేర్లు విస్తరించి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారి వెంకటయ్య సిబ్బందితో కలిసి సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు పైపులైన్‌ను తవ్వి చూడగా పైపునిండా 20మీటర్ల మేర పొడవు చెట్ల వేర్లు పేరుకుపోయాయి. కాలంచెల్లిన పైపులతో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


పైపులో పేరుకున్న వృక్షాల వేర్లు

పంట కాల్వ పరిశీలన

బొంరాస్‌పేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ పెద్ద చెరువు కాల్వ, ఏటి కాల్వలకు రూ.4కోట్లు మంజూరైనట్లు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈఈ జోసెఫ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు సోమవారం పెద్ద చెరువు కింద పంట కాల్వలతో పాటు చెరువులోకి వచ్చే ఏటి కాల్వను పరిశీలించారు.


సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శుభప్రద్‌పటేల్

మహిళలకు విద్యాప్రదాత సావిత్రీబాయి పూలే

వికారాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విద్యకు నోచుకోక వివక్షకు గురవుతున్న మహిళల కోసం దేశంలోనే మొదటిసారి మహిళా పాఠశాలను నెలకొల్పి విద్యనందించిన మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎస్.శుభప్రద్‌పటేల్ అన్నారు. సోమవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని వికాస్ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పూలే దంపతులు అంటరానితనం, సతీసహగమనం వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కృషిచేశారన్నారు. బడుగుల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేడు మహిళల్లో చైతన్యం వచ్చిందంటే నాడు సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాలు, కృషి ఫలితమే అన్నారు. వారిని సమాజం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వికారాబాద్‌లో పూలే దంపతుల విగ్రహాలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు కె.మారుతి, ఎస్.దేవదాస్, మానిక్‌రెడ్డి, ఎం.దేవదాస్, తిరుపతిరెడ్డి, దత్తు, సుజిత్, సురేష్, సిద్ధికి, అఖిల్ పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకులం

ఆమనగల్లు, మార్చి10(ఆంధ్రజ్యోతి): అంతరాలను తొలగించి అందరికీ సమాన విద్యను అందించాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఆయా మండలాల ఎంఈవోలతో సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని సాధించిన ఎమ్మెల్యేను పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, నాయకులు గుర్రం కేశవులు, కల్లు రమణారెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, యాదయ్యగౌడ్, ఎంఈవోలు సత్కరించారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి నివేదికలివ్వాలని ఎమ్మెల్యే ఎంఈవోలను ఆదేశించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు మూత్రశాలలు, తాగునీటి వసతికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేందుకు ప్రభుత్వం సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఖానాపూర్‌లో 20ఎకరాల్లో త్వరలోనే స్కూల్ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే ఆమనగల్లులో జూనియర్ కళాశాల నిర్మాణ పనులూ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లు సర్దార్‌నాయక్, సత్యనారాయణ, చంప్లానాయక్, పాండు, నాయకులు యాదయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, బాబ, నర్సింహ, నరేశ్‌నాయక్, రవీందర్, హన్మనాయక్, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న శంకర్, నాయకులు

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

కడ్తాల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీసీసీ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడిగా నియమితులైన వంశీచంద్‌రెడ్డిని కాంగ్రెస్ ఎస్సీసెల్ కల్వకుర్తి నియోజకవర్గ చైర్మన్ పోతుగంటి శంకర్, పారిశ్రామికవేత్త కొర్పోలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వంశీచంద్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామన్నారు. మరేరాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. అవినీతి, అక్రమాలతో అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, విపక్షాల కుట్రలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, నాయకులు చేగూరి వెంకటేశ్, అశోక్, నంద్యనాయక్, నరేందర్, రామకృష్ణ, జగన్, సత్యం, యాదయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ చట్టం చేసే వరకు ... గ్రూప్స్ ఫలితాలు ప్రకటించొద్దు

తలకొండపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు అన్ని గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని తలకొండపల్లిలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఉద్యోగ పరీక్ష ఫలితాలు నిలిపివేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ పద్మనర్సింహ ప్రారంభించారు. దీక్షలకు పలు సంఘాల నేతలు, నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి నియామకాలు చేపడితేనే మాదిగలు, ఉప కులాలకు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపడితే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మాలల ఒత్తిళ్లకు తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు తుడుం శ్రీను, నాయకులు రామచంద్రయ్య, కుమార్, యాదయ్య, సుధాకర్, నారాయణ, రాజు, సంజీవ, మార్కండేయ, గణేశ్, మహేశ్, గోపాల్, శ్రీశైలం, శేఖర్, రజనీకాంత్, బాల్‌రాజ్, వంశీ, రవితేజ పాల్గొన్నారు.

నవాబుపేట: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్-1, 2ఫలితాలను ప్రభుత్వం నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులకు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖదీర్, నర్సింహారెడ్డి, వడ్ల రాములు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, చంద్రం, జానీ, కిష్టయ్య, బద్రి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలకు రక్షణేది?

- పరిగిలో 29 పార్కు స్థలాల గుర్తింపు
- కూలిపోతున్న ఉద్యాన స్థలాల రక్షణ గోడలు
- ప్రహరీల గ్రిల్స్, పైపులు దొంగలపాలు
- కొన్ని కాలనీల్లో పార్కు జాగాల కబ్జా
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

పరిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపల్ పరిధి పార్కుల స్థలాలకు రక్షణ కరువైంది. పరిగి పట్టణం ఏటేటా విస్తరిస్తోంది. కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. వెంచర్లలో నిబంధనల ప్రకారం వదిలే పార్కు స్థలాల నిర్వహణ లేకుండాపోతోంది. పార్కు స్థలాల చుట్టూ ప్రహరీలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఐదారేళ్ల నుంచి మునిసిపల్ పరిధి 15వార్డుల్లో కొత్త కాలనీల్లో 29 చోట్ల పార్కు స్థలాలను గుర్తించారు. వాటిల్లో మూడింటిలోనే మొక్కలు పెంచుతున్నారు. అయితే మొక్కలకు నీరు కూడా పోయడంలేదు. కొన్ని పార్కులకు పైపులతో ప్రహరీలు, కొన్నింటికి ఫెన్సింగ్ వేశారు. అయితే వాటిపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేక కబ్జా అవుతున్నాయి. ప్రహరీలు కూలుతున్నాయి. ప్రహరీలను కూల్చి వాటి కమర్చిన పైపులు, గ్రిల్స్‌ను ఎత్తుకపోతున్నారు. ఇలా తిరుమల, మైత్రీ వెంచర్ల పార్కుల్లోని పైపులు, గ్రిల్స్ చోరీ అయ్యాయి. దీనిపై మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి వదిలేశారు. పట్టణంలో 29చోట్ల పార్కు స్థలాలున్నట్లు రికార్డుల్లో ఉన్నా.. వాస్తవంగా పదిలోపు స్థలాలకే ఫెన్సింగ్ వేశారు. మిగతావాటికి రక్షణే లేదు. ఆ స్థలాలు ఎక్కడున్నాయో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు కూడా తెలియదు. పార్కు స్థలాల్లో కొందరు రియల్టర్లు, స్థానికులు కబ్జా చేస్తున్నారు. అధికారులు వెంటనే పట్టణంలో గుర్తించిన పార్కు స్థలాల చుట్టూ ప్రహరీలు, ఫెన్సింగ్ వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


మైత్రీనగర్‌లో కళా విహీనంగా మారిన పట్టణ ప్రకృతి వనం


మైత్రీనగర్‌లో కూలిన పార్కు ప్రహరీ


తిరుమల రెసిడెన్సీలో నిర్వహణ లేని పార్కు స్థలం

స్థలాలకు ఫెన్సింగ్ వేస్తాం



పరిగి మునిసిపల్ పరిధిలో 29చోట్ల పార్కుల స్థలాలను గుర్తించాం. మూడు చోట్ల మొక్కలు పెంచుతున్నాం. మరో మూడు పార్కుల్లో మొక్కలు నాటుతాం. పార్కుల గ్రిల్స్, పైపుల చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. పట్టణంలోని అన్ని పార్కు స్థలాల గుర్తించి వాటికి ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, పరిగి

మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రీ బాయి పూలే అని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధతిని పురస్కరించుకొని సోమవారం బీసీ సంఘం తాండూరు శాఖ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, అనిత, మంజుల, శివలీలా, వీరమణి, జగదీశ్వర్, పరమేష్, పాండు, రమేష్, ఆనంద్, నవీన్ గౌడ్, బాబా గౌడ్, బస్వరాజ్, అరుణ్ రాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో మండల నాయకులు

చౌడాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లాల్‌పహాడ్ నుంచి చౌడాపూర్ మండల కేంద్రానికి డబుల్ బీటీరోడ్డు, మండలంలో పలు సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రగుంట మాసయ్య, అశోక్‌కుమార్, రాము, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలం

కులకచర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ వెల్కిచర్ల పాంబండ ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య ఆధ్వర్యంలో కొబ్బరికాయల విక్రయానికి సోమవారం వేలం నిర్వహించారు. సంవత్సరం పాటు కొబ్బరి కాయలు విక్రయించేందుకు కాకర్లపహాడ్ వెంకటయ్య రూ.9లక్షల 40 వేలు (చిన్న జాతర 10 రోజులు, పెద్ద జాతర 15 రోజులు మినహాయింపు), జాతర సమయంలో విక్రయానికి బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ రూ.6లక్షల 92 వేలకు దక్కించుకున్నారు. హుండీ లెక్కించగా రూ.2,87,591 వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మధుబాబు, పాలకవర్గ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి

ఘట్‌కేసర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయంలో మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పల్లె విజయ్ ఆధ్వర్యంలో పలువురు కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. నిత్యం గురుకుల పాఠశాలలో ఉదయం, సాయంత్రం అనేక మంది వాకింగ్ చేస్తారని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నందున వెంటనే చర్యలు చేపట్టి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆకాశాన్ని తాకుతున్న అక్రమ నిర్మాణాలు!

(5వ పేజీ తరువాయి)

సీఎంఆర్ విద్యాసంస్థలతోపాటు ఇతర విద్యాసంస్థల్లో 10వేలకు పైగా విద్యార్థులున్నారు. ఇంతమంది విద్యార్థులకు కళాశాల తరఫున వసతి గృహాలు ఏర్పాటు చేయటం కష్టతరంగా మారింది. దీనిని అదునుగా భావించిన కొందరు ఈ ప్రాంతంలో స్థలాలు తీసుకొని పెద్ద ఎత్తున అక్రమంగా భవనాలు నిర్మించి అద్దెకిస్తున్నారు. దాదాపు ఐదేళ్లుగా 200కు పైగా అనుమతులు లేకుండా భవనాలు నిర్మించినట్టు సమాచారం. కొందరు జీ ప్లస్ వన్‌కు అనుమతి తీసుకొని ఆరు అంతస్తుల వరకు భవనాలను నిర్మించారు. ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఇంకా కొన్ని భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ నిర్మాణాలకు స్థానికంగా కొందరు నాయకులు, మున్సిపల్ అధికారుల అండదండలున్నాయని స్థానికులు చెబుతున్నారు.



కండ్లకోయలో అక్రమంగా నిర్మిస్తున్న భవనం

ఆదాయం రెట్టింపునకు అవకాశం

ఈ అక్రమ నిర్మాణాల వెనుక రాజకీయ నేతల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినబడుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు ప్రాంతాల్లో బడా నాయకులకు సంబంధించిన భవనాల్లో విద్యార్థుల వసతిగృహాలు కొనసాగుతున్నాయి. భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వాటికి ఇంటి నంబర్లను కేటాయించలేదు. ప్రస్తుతం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి ఇంటి పన్నుల రూపంలో వార్షిక ఆదాయం రూ.16 లక్షలు సమకూరుతున్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తే ఈ ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఉంది. దీనికితోడు అనుమతులు పొందడానికి ఫీజుల రూపంలో వచ్చే డబ్బులతో మరింత ఆదాయం పెరిగే వీలుంది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి హెచ్ఎండీఏ ద్వారా అనుమతి పొందితే లక్షల్లో ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మూడు అంతస్తులకు మించి నిర్మాణం చేపడితే ఆ అంతస్తును మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. దీంతో భవన నిర్మాణం చేపట్టేవారు అధికారులకు ముడుపులు చెల్లిస్తూ దర్జాగా వారి పని వారు చేసుకుపోతున్నారు.

'కారుణ్యా'నికి గ్రీన్ సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

నియామకాలు చేపట్టారు. రెండు టైపిస్ట్, రెండు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేశారు. కారుణ్య నియామకాల కింద ప్రస్తుతం జిల్లా పరిషత్తులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం బాధిత కుటుంబాల నుంచి 24 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్లుగా తమకు పోస్టింగ్ ఇవ్వాలంటూ బాధిత కుటుంబాల వారసులు ఉన్నతాధికారులపై, గత ప్రభుత్వ పెద్దలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారు. 2023, సెప్టెంబరు నెలలో కారుణ్య నియామకాల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ఆధారంగా ఎన్ని జూనియర్ అసిస్టెంట్ పోస్టులు అవసరమంటూ రాష్ట్ర ప్రభుత్వం జెడ్పీ అధికారులను కోరగా, 18 పోస్టులు కావాలంటూ నివేదిక ఇచ్చారు.

సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి..

కారుణ్య నియామకాలకు అనుమతించిన రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో తమకు అందిన నివేదిక ప్రకారమే జూనియర్ అసిస్టెంట్ కేటగిరిలో సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించింది. ప్రభుత్వం 18 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేస్తే జెడ్పీలో 24 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించే యజమానులు చనిపోయి ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జెడ్పీ, మండల పరిషత్తు పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా నియామకాలు లేక అవస్థలు పడుతున్నాయి. ఎట్టకేలకు కారుణ్య నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో త్వరలో ఇందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభించనున్నట్లు తెలిసింది.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

నవాబుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ నాయకులు కావలి నర్సింహులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబంధు నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రూప్-1, 2 ఫలితాలు ప్రకటించొద్దు



ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షను విరమింపజేస్తున్న ఏఎంసీ డైరెక్టర్లు

నవాబుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్-1, 2 ఫలితాలను ప్రభుత్వం ప్రకటించొద్దని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులకు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖదీర్, నర్సింహారెడ్డి, వడ్ల రాములు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, చంద్రం, జానీ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం 'ఇందిరా మహిళాశక్తి' ద్వారా స్వయం స్వయం సహాయక సంఘాలకు తొలి విడతగా 150 బస్సులను అద్దెకు ఇచ్చే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళలకు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

యాలాల: రాఘవాపూర్ గ్రామానికి చెందిన పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు నర్సిరెడ్డి తల్లి భీమమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోమవారం రాఘవాపూర్ గ్రామానికి వెళ్లి భీమమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సురేందర్‌రెడ్డి, అక్బర్ బాబా, లక్ష్మారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మూడున్నర కిలోల గంజాయి పట్టివేత

- నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు



గంజాయిని పట్టుకున్న మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు

మేడ్చల్ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో మూడున్నర కిలోల గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణంలోని చెక్‌పోస్టు నుంచి కిష్టాపూర్ వెళ్లే మార్గంలో సోమవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పులిమెట్టకు చెందిన సమర్ సర్కార్ వద్ద మూడున్నర కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో నిందితుడిని అదుపులో తీసుకుని విచారించగా పారిశ్రామికవాడలో పనిచేసే కూలీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృత్యువాత

వికారాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో జింక మృత్యువాతపడింది. ఈ ఘటన అనంతగిరిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం కుక్కల గుంపు ఒక్కసారిగా జింకపై దాడి చేయగా అటుగా వెళుతున్న వారు అడ్డుకునే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేక పోయింది. దీంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అటవీ శాఖ సిబ్బంది అది అక్కడికి చేరుకుని కుక్కలను చెదరగొట్టారు. అయితే అప్పటికే జింక మృత్యువాతపడింది. జింకను వికారాబాద్ పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.



కుక్కల దాడిలో మృతి చెందిన జింక

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని నవ్యగ్రాండ్ (ఓయో) హోటల్‌లో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు అక్కడికి వెళ్లి తనిఖీలు చేపట్టగా అక్కడ పేకాడుతుండగా ఘట్‌కేసర్‌కు చెందిన మహ్మద్‌అలీ, గుండు సురేష్, తిరుపునురి కిషన్, మామిండ్ల వెంకటేష్, గుండ్ల సిద్దార్థ, మోలుగు సంతోష్, మదుగని మాధవ్, నిర్వాహకుడు గోపీలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.27,600ల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, 3 పేకాట సెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

ధారూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు ఎస్ఐ అనిత తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం బాధితులకు అప్పగించారు.

ఉద్యోగం తొలగించారని కంప్యూటర్ ఆపరేటర్ ఆందోళన

మర్పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి తిరిగి వచ్చే సరికి తన ఉద్యోగాన్ని తొలగించి కుటుంబాన్ని రోడ్డు పాలుచేశారని కాంట్రాక్ట్ ఉద్యోగి పాఠశాల ఎదుట ఆందోళనకు దిగాడు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మహేశ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుండేవాడు. డిసెంబరు నెలలో తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లగా కడుపులో కణితి ఉందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరాడు. ఈ విషయాన్ని ఆయన భార్య మౌనిక పాఠశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించింది. ఇందుకు ప్రిన్సిపాల్ పర్వాలేదు వైద్యం పూర్తయిన తర్వాత విధుల్లో చేరాలని చెప్పాడు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స అనంతరం విధుల్లో చేరేందుకు వెళితే పాఠశాల, సంబంధిత కాంట్రాక్టర్ నుంచి సమాధానం రాకపోవడంతో సోమవారం విధి నిర్వాహణలో చేరేందుకు వెళ్లాడు. ఉద్యోగం నుంచి తొలగించారని, మరొకరిని నియమించారని పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ తెలపడంతో మహేశ్ కంగుతిన్నాడు. ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేయగా తనకు ఎలాంటి సంబంధం లేదని, పాఠశాలలో నీ స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న మహేశ్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగాడు. తన భర్త ఉద్యోగంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, ఇప్పుడు ఉద్యోగం నుంచి తొలగిస్తే తమ పరిస్థితి ఏంటని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ తమపై దయతలచి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని వేడుకున్నారు.

భక్తులకు తాగునీటిని అందించడం అభినందనీయం



కావలి గోపాల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భక్తులకు తాగునీటిని అందించడం అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండలంలోని ఎల్లకొండ గ్రామంలో సోమవారం పార్వతీ పరమేశ్వర జాతర ఘనంగా నిర్వహించారు. ఎండతీవ్రత నేపథ్యంలో గ్రామానికి చెందిన కావలి గోపాల్ ఉత్సవాల్లో భక్తులకు తాగునీటి వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశం, లింగం, కావలి సుదర్శన్, గోపాల్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల డ్రాపౌట్ నివారణకు 'ట్విన్నింగ్'

దౌల్తాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు 5వ తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత పాఠశాలల్లో ప్రవేశాలు పొందకుండా డ్రాపౌట్ అవుతున్నారని, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం ట్విన్నింగ్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని హెచ్ఎం శ్రీహరిరెడ్డి తెలిపారు. పాఠశాలల ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థులను హెచ్ఎం సాయిలుగౌడ్ దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఘనంగా మల్లన్నస్వామి కల్యాణోత్సవం

మేడ్చల్ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నూతన్‌కల గ్రామంలో సోమవారం నిర్వహించిన మల్లన్న స్వామి వారి కళ్యాణోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి స్వామివారి కళ్యాణం పూర్తయ్యేంత వరకు ఆలయంలో దగ్గరుండి కళ్యాణం జరిపారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారి ఆశీసులను పొందారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఫకీర్‌టెక్యా తండాకు చెందిన భానుప్రియ కుటుంబసభ్యులకు సోమవారం ఆయన రూ.25,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధ్య పవన్‌నాయక్, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ టౌన్: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

వైభవంగా బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చౌడాపూర్: మండలంలోని మరికల్‌లో వెలిసిన శ్రీ కోటచింతల బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అగ్నిగుండం, మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణమహోత్సవం, సాయంత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

13 నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దోమ: మండలంలోని మైలారంలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మూడావత్ రాములునాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

నవాబుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నేడు(మంగళవారం) నిర్వహిస్తున్న జాబ్‌మేళాను వినియోగించుకోవాలని నవాబుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కందాడ నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, డైరెక్టర్ వడ్ల పార్వతమ్మ, రాములు అన్నారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్లలో మంగళవారం ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ కంపెనీ వారు జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు.

విజయోత్సవాలు



జాతీయ పతాకంతో యువకుల సంబురాలు

ధారూరు, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ క్రికెట్ జట్టు విజయం సాధించటంతో ఆదివారం రాత్రి ధారూరులో యువకులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నెగ్గిన భారత్ జట్టు ట్రోఫీ అందుకున్న తరుణంలో యువకులు గ్రామంలో టపాసులు పేల్చి డప్పులతో ఊరేగింపు నిర్వహించి టీమిండియాకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా శాంతిగోపాల్

బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా భోజ్యానాయక్‌తండా మాజీ సర్పంచ్, శాంతిగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం ధృవీకరించారు. ఈసందర్భంగా శాంతిగోపాల్‌ను ఎమ్మెల్యే శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎల్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బుయ్యని సత్యనారాయణరెడ్డి, నవాల్గ మాజీ సర్పంచ్ మల్లమ్మ తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

గుండెపోటుతో గురుస్వామి మృతి

వికారాబాద్: పట్టణానికి గురుస్వామి పురం మనోహర్ (69) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. వికారాబాద్ ప్రాంతంలో మంచి పేరు పొందిన ఆయన ఈ ఏడాదే తన 36వ మాలధారణ చేసి పెద్దఎత్తున అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించారు. అయ్యప్ప స్వాముల పూజల నిర్వహణలో ముందుండేవారు. ఆయన మృతి పట్ల వికారాబాద్ అయ్యప్ప సేవా సమితి, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. కాగా సోమవారం ధన్నారం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

తాండూరులో హెడ్ కానిస్టేబుల్..

తాండూరు రూరల్: తాండూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాంచందర్ గుండెపోటుతో మృతిచెందారు. గత కొన్ని రోజుల కిందట ఆయన అనారోగ్యానికి గురికాగా కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. గుండెకు సంబంధించిన వ్యాధికారణంగా స్టంట్ వేశారు. రాంచంద్ పరిస్థితి విషమించడంతో వైద్యులు సోమవారం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాండూరు డీఎస్పీ రాంచంద్రారెడ్డి, సీఐ నాగేష్, పట్టణ సీఐ సంతోష్‌కుమార్, కరన్‌కోట్ ఎస్ఐ, విఠల్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

పాఠశాలకు వెలుగులు

బొంరాస్‌పేట్: పాఠశాల నిధులు రూ.65వేలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొంరాస్‌పేట్‌లో హైమాస్ట్ దీపాలను ఏర్పాటు చేశారు. సోమవారం హైమాస్ట్ దీపాల ఏర్పాటులో భాగంగా స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు బిగించారు. దీంతో పాఠశాలకు కొత్త వెలుగులు వచ్చాయి.

రైతులను ప్రగతి పథకంలోకి తేవడమే ధ్యేయం

మేడ్చల్ ప్రతినిధి: రైతులను అన్నిరంగాల్లో ప్రగతి పథంలోకి తీసుకవెల్లడమే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ధ్యేయమని ఆ సంఘం మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు జంగయ్యలు అన్నారు. శామీర్‌పేట మండలం బాబాగూడలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు జంగయ్య పెద్ద ఎత్తున రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల మార్చి 25, 26, 27 తేదిలలో నిజామబాద్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర మహాసభలను పెద్ద ఎత్తున నిర్వహించన్నుట్లు వారు వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లోగల 2వ వార్డులో రోడ్లను, డ్రైనేజీలను ఆక్రమించి ఇళ్లను నిర్మిసుతన్న వారిపై చర్యలు తీసుకోవాలని మధుసూదన్‌గౌడ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

డబిల్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్ టౌన్: మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో క్రిస్టిన, వీణాకుమారి పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవం

కొడంగల్: మండలంలోని పర్సాపూర్ గ్రామ సమీపంలో పురాతన శ్రీ ర్యాలపేట వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వీరభద్రస్వామి, నంది, నాగదేవత, ధ్వజస్తంభం, శిఖర కలశం ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంటపారాధన, దేవీ హోమం, విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం, రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, వీరశైవ లింగాయత్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌వర్ధన్ స్వామివారిని దర్శించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం

బొంరాస్‌పేట్: మండలంలోని బొట్లవనితండాలో జై సేవాలాల్ మహారాజ్ ఇంటర్‌నెట్, నెహ్రూనాయక్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రంసింగ్, నెహ్రూనాయక్, బాలునాయక్, రాజునాయక్, దేవ్‌జనాయక్, లాలునాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public is hereby informing that **Sri. Syed Feroz S/o, Syed Mahaboob** R/O Malkapur, Chevella, Ranga Reddy Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that Open Plot bearing No.115,Sy No.12,13,14,&15 Admeasuring 100.00. sq. yds, Situated at Kamala Colony, Chevella Village, Chevella Mandal, Ranga Reddy Dist. And Bounded; **North:** Plot No.114. **South:** Plot No.116. **East:** 30 Feet Wide Road. **West:** Plot No.64.My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates,
Off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad. Dist - 501101,
PH: 9246362213; 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that **Sri. Mohammed Khaleel S/o, Mohammed Osman** R/O Rangareddy Colony, Chevella. Ranga Reddy Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that Open Plot bearing No.43,Sy No.16/A, Admeasurig 250.00. sq. yds, Situated at Sri Sai Ram Colony, Chevella Village, Chevella Mandal, Ranga Reddy Dist. And Bounded: **North:** Plot No.62. **South:** 20'-00" Feet Wide Road. **East:** Plot No.44. **West:** 40'-00" Feet Wide Road.My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates,
Off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad. Dist - 501101,
PH: 9246362213; 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that **Sri. Thumpally Raghavender S/o, Thumpally Anjaneyulu** R/O Yenkepalle, Manneguda, Pudur, Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that Open Plot bearing No.61,Sy No.108/1 & 108/4Admeasurig 199.33. sq. yds. Situated at Surya Prakash Satilite Township, Yenkepally Village, Vikarabad Municipality, Vikarabad Dist. And Bounded; **North:** Open Place. **South:** Plot No.62. **East:** Open Place. **West:** 40'-0" Wide Road. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates,
Off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad. Dist - 501101,
PH: 9246362213; 9603019574.